క్లుప్తంగా

నేడు గణపయ్య మట్టి విగ్రహాల పంపిణీ

పట్నంబజారు: ప్రకృతిని కాపాడుకునే దిశగా వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టి గణపయ్య విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు కాకాని రోడ్డు, నెహ్రూనగర్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు నేతృత్వంలో గోగ్రీన్ అనే నినాదంతో మట్టి విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సంతోషాల నడుమ పండుగను నిర్వహించుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పట్నంబజారు: నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల శనివారం కొత్తపేట, శీలంవారి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న నీటి పైపులైను యూజీడీ, సైడ్ డ్రెయిన్, సీసీ రోడ్లను పరిశీలించారు. రూ. 27లక్షలతో నిర్వహిస్తున్న పనుల్ని పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, కిశోర్, మౌలాలి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలు పొన్న శ్రీలత నల్గొండలోని మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ''వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ ఆఫ్ ఉమెన్ ఎంప్లాయీస్ ఇన్ సెలెక్ట్ ఐటీ కంపెనీస్ ఇన్ హైదరాబాద్'' అనే అంశంపై ప్రొఫెసర్ ఆకుల రవి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఆమె డాక్టరేట్ పొందినట్లు పేర్కొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో స్మార్ట్ ఐడియా చాలెంజ్ పోటీలు

గుంటూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించే స్మార్ట్ ఐడియా హ్యాకథాన్ 2023లో పాల్గొనేందుకు తమ కళాశాల విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోగల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఐసీ కౌన్సిల్, ఐఐపీ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలలో ప్రతిభను చాటేందుకు కళాశాలలో స్మార్ట్ ఐడియా చాలెంజ్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చూపే ప్రతిభ ద్వారా కేంద్ర ప్రభుత్వ రంగాల్లో సేవలందించినందుకు, అంకుర పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహానికి అవకాశాలు లభిస్తాయని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ తెలిపారు. ప్రపంచంలో అతి పెద్ద ఓపెన్ ఇన్నోవేషన్ మోడల్‌గా ఎంతో ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచేందుకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించనున్నట్లు కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె. కార్తిక్, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ ఎం.వి.పి చంద్రశేఖర్, చింతలపూడి శ్రీకాంత్, డాక్టర్ సి. తారాశశాంక్, డాక్టర్ ఈ. నాగేశ్వరరావు, డాక్టర్ బి. ఈశ్వర్‌చైతన్య, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో శివాలయం అభివృద్ధి

పెదకాకాని: శివాలయాన్ని దాతల సహకారంతో అన్ని విధాలా తీర్చిదిద్దుతానని ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. పెదకాకాని శివాలయంలో శనివారం పాలకమండలి చైర్మన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. భక్తులకు సౌకర్యాలు, ఏర్పాట్లు, ఆలయ అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పొగాకు కొట్ల వారి స్థలంలో దేవదాయ శాఖ కమిషనర్ అనుమతితో భక్తుల సౌకర్యార్థం గదులు నిర్మాణం, దేవస్థానానికి ఉత్తర, పడమర ప్రహరీ నిర్మాణం, నిత్య కల్యాణం, సహస్ర దీపాలంకరణ సేవ నిమిత్తం దిట్టం ఆమోదించినట్లు తెలిపారు. శ్రీ గణపతి నవరాత్రులు, శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల ఏర్పాట్లు, నిత్యావసర సరుకుల ధరలు ఆమోదంతో పాటు భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదాన ప్రసాద వితరణ సంఖ్య ప్రతిరోజూ 100 నుంచి 125 మందికి, ఆది, సోమ వారాలలో 200 నుంచి 250 మందికి చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. ఆగస్టు నెల జమా ఖర్చులు ఏకగ్రీవంగా పాలకవర్గం ఆమోదించినట్లు ఏసీ శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ సమావేశంలో పాలకవర్గం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారమే రోడ్ల నిర్మాణం : మేయర్



రోడ్డుపై ఆక్రమణలు తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రోడ్లపై ఆక్రమణలు తొలగించి మాస్టర్ ప్లాన్ ప్రకారం విస్తరణ చేపట్టాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఆయన శనివారం 23వ డివిజన్ దర్గా వెనుక వైపు రోడ్డులో నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి పర్యటించారు. ఆక్రమణల తొలగింపును పరిశీలించారు. మరలా జరగకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దర్గా వెనుక వైపు బీటీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు, డ్రెయిన్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. ఆక్రమణల తొలగింపులో స్థానిక ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. నగరంలో ఇప్పటికే పలు ప్రధాన రోడ్ల విస్తరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాదు రాజేష్, గేదెల రమేష్, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శకమైన పాలన అందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందిస్తున్నారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. 20వ డివిజన్ పరిధిలో పలువురికి నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్లు, ఓటీఎస్ పత్రాలను సంపత్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారనారు. ఇచ్చిన హామీలే కాకుండా ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాల్ని ప్రవేశపెట్టారని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల్ని అందజేస్తున్నారని తెలిపారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాల్ని త్వరితగతిన అందజేస్తున్నారని, ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ గృహాల బకాయిలను ఓటీఎస్ ద్వారా నామమాత్రపు రుసుం చెల్లించి సొంతం చేసుకునే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. నగరంలో 70 వేల మందికి ఇళ్ల పట్టాల్ని అందజేశామని, సదరు ప్లాట్లలో త్వరలోనే నిర్మాణాలు పూర్తవుతాయని తెలిపారు. నగరంలో అభివృద్ధి పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని మేయర్ చెప్పారు. 20వ డివిజన్ కొబ్బరితోట ప్రాంత వాసుల తాగునీటి కష్టాలు తీర్చడానికి వాటర్ ట్యాంక్ ను నిర్మిస్తున్నామని తెలిపారు. లోవోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా సబ్ స్టేషన్‌ను త్వరలో నిర్మించనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ప్రెసిడెంట్లు కంతేటి శ్యాం శేఖర్, ఖాజా మొహిద్దీన్, చంబేటి బాబు, నాగూర్, సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ శిఖరం బొజ్జ తారకం



బొజ్జ తారకం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత నేతలు

నెహ్రూనగర్: దళిత ఉద్యమ శిఖరం బొజ్జ తారకం అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు.అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో శనివారం బొజ్జ తారకం ఏడో వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి దళిత నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ నిరంతరం దళిత హక్కుల పరిరక్షణ కోసం బొజ్జ తారకం పాటుపడ్డారన్నారు.జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ సిద్ధాంతాలను అణగారిన కులాలకు చేరువచేసిన ఉద్యమ శిఖరం బొజ్జ తారకం అని పేర్కొన్నారు. తరతరాలుగా అసమానతలు, అవమానాలతో బాధింపబడ్డ ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు న్యాయవాద వృత్తినే ఆయుధంగా చేసుకొని, రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని సాధించేందుకు నిరంతరం శ్రమించారని కొనియాడారు. బొజ్జ తారకం ఆశయాల్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

అట్టహాసంగా బజాజ్ పల్సర్ మానియా మహోత్సవం

అబ్బురపరిచిన మోటారు సైకిళ్ల విన్యాసాలు



బండ్లమూడి గార్డెన్స్ ఆవరణలో స్టంట్ రైడర్ల విన్యాసం

నగరంపాలెం: శ్రీ సిద్ధి వినాయక బజాజ్ (అమరావతి రోడ్డు) ఆధ్వర్యంలో బండ్లమూడి గార్డెన్స్ ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించిన పల్సర్ మానియా ఎన్‌ఎస్- 125 స్టైల్ మహోత్సవం ఆద్యంతం అబ్బుర పరిచింది. పేరొందిన స్టంట్ రైడర్ల విన్యాసాలు అలరించాయి. బజాజ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరంలో మొదటిసారిగా పల్సర్ మానియా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఖాతాదారులకు పల్సర్ పవర్ చూపించడం ఇందులో భాగమని తెలిపారు. సురక్షితమైన పద్ధతిలో స్టంట్ రైడింగ్‌లో మోటారు సైకిళ్ల ప్రియులకు తర్ఫీదిస్తామని చెప్పారు. ఏఎస్‌ఎం అశోక్ మాట్లాడుతూ బజాజ్ పల్సర్‌తో గత 21 ఏళ్లుగా తిరుగులేని బావుటా ఎగురవేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బజాజ్ ఏఎస్‌ఎం శరత్ బాష (విజయవాడ), వారాహి బజాజ్ మేనేజర్ శ్రీనివాస్ (తెనాలి), సర్వీస్ ఏఎస్‌ఎం చంద్రశేఖర్, సర్వీస్ గుంటూరు బజాజ్ జనరల్ మేనేజర్ సారథి పాల్గొన్నారు.

అన్ని హంగులతో మిర్చి యార్డు ఆధునీకరణ

చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ



యార్డులో పర్యటిస్తున్న చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, అధికారులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డును అన్ని హంగులతో ఆధునీకరిస్తామని చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డితో కలసి శనివారం సాయంత్రం ఆయన యార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత భవనాలు, వాడుకలో లేని స్థలాల్ని ఆధునీకరించి వినియోగంలోకి తీసుకురావడం కోసం యార్డులో పర్యటించినట్లు తెలిపారు. ఈ నెల 21న మరోసారి పాలకవర్గం, అధికారులు, మిర్చి దిగుమతి, ఎగుమతి వ్యాపారులతో కలసి యార్డును సందర్శించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యార్డు అధికారి సుబ్రహ్మణ్యం, మిర్చి దిగుమతి అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొత్తూరి సుధాకర్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

కంపెనీని మోసం చేసిన భార్యాభర్తలపై కేసు

గుంటూరు ఈస్ట్: కంపెనీని మోసం చేసిన భార్యాభర్తలపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యానగర్‌లో నివసించే కోటపాటి విజయకుమార్ సక్కూ గ్రూప్ పౌల్ట్రీ కంపెనీ జనరల్ మేనేజర్‌గా పని చేస్తుంటారు. కంపెనీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న యాదల సుధాకరరావు, అతని భార్య షకీలా తప్పుడు ల్యాబ్ రిపోర్ట్ ఇచ్చి కంపెనీని నష్టపరిచినట్లు విజయకుమార్ ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంపెనీ పైనా భార్యాభర్తల ఫిర్యాదు

తాము పనిచేసే సక్కూ గ్రూప్ పౌల్ట్రీ కంపెనీ అధికారులు గదిలో బంధించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ల్యాబ్ టెక్నీషియన్ యాదల సుధాకరరావు, అతని భార్య షకీల కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ నుంచి రూ. 12.30 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా డీజే బాక్సులు పెట్టిన ముగ్గురిపై కేసు

అనుమతి లేకుండా డీజే బాక్సులు పెట్టిన ముగ్గురిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రింగ్ రోడ్డులోని శుభం కల్యాణ మండపం ఎదురుగా కొందరు డీజే బాక్సులు పెట్టి 'నేను సైతం బాబు కోసం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అనుమతులు లేకుండా డీజే బాక్సులు పెట్టిన షేక్ మస్తాన్, మొగలి సాంబశివరావు, బాలకృష్ణపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

సింగిల్ నంబరు లాటరీ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

సింగిల్ నంబరు లాటరీ నిర్వహిస్తున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేషన్ పరిధిలో బత్తుల గోపి సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నాడు. పోలీసులు దాడిచేసి అతడ్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ. 250 నగదు, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిపై దాడి

పదో తరగతి విద్యార్థి తోటి విద్యార్థిపై దాడి చేయడంతో కళ్లు పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లిటిల్ ఫ్లవర్ స్కూలులో పదో తరగతి చదువుతున్న హరిచరణ్‌ను ఆర్యయల్ అనే తోటి విద్యార్థి స్కేల్‌తో కంటిపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన హరిచరణ్‌ను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి కళ్లు పోయినట్లు నిర్ధారించారు. హరిచరణ్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి వేధిస్తున్న యువకులు

యువతిని వెంటపడి వేధించిన ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌కు చెందిన యువతి బ్రాడీపేటలో ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. అదే కళాశాలకు చెందిన బస్సు డ్రైవర్ గేరా జగన్, అతని మిత్రులు బాలాజీ, గోపీచంద్‌లు ఆమె వెంటపడి వేధిస్తున్నారు. యువతి ఈ విషయాన్ని తన సోదరుడికి ఫోన్ చేప్పింది. యువతి సోదరుడు మిత్రుల్ని ఘటనా స్థలానికి పంపించాడు. వారు అక్కడకు చేరుకుని గేరా జగన్, బాలాజీ, గోపిచంద్‌ను కొట్టారు. దీనిపై ఇరువర్గాలు పోలీసు స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదు చేసుకున్నాయి. పోలీసులు రెండువైపులా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పెరియార్ రామస్వామి జయంతి సభ

నెహ్రూనగర్: సామాజిక న్యాయం, సమానత్వ లక్ష్య సాధన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు పెరియర్ రామస్వామి 145వ జయంతి సభ అరండల్‌పేట 1వ లైనులోని మినీ అంబేడ్కర్ హాలులో ఆదివారం నిర్వహించనున్నట్లు సామాజిక వేత్త, సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక న్యాయం, సమధర్మాల్ని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ సభలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు విజ్ఞాన మందిరంలో సాంస్కృతిక మహోత్సవం

పాత గుంటూరు: స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం డాన్స్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో సాంస్కృతిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కల్యాణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో లారెన్స్ గ్రూప్ డాన్స్, క్లాసికల్, వెస్ట్రన్ గ్రూప్ డాన్స్, వెరైటీ డాన్స్ షో, శివ మిమిక్రీ , శరణ్య, విజయసాయి సంగీత విభావరి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

హోదా ఉద్యమం ఆగదు

పాత గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఉద్యమం ఆగదని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల్ని అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం తెలుగుజాతిని నమ్మక ద్రోహం చేసిందని విమర్శించారు. హోదా కోసం ఎంతకైనా తెగిస్తానన్న పవన్ కల్యాణ్ నేడు బీజేపీ చేతుల్లో బందీగా మారడం ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పి.వి.మల్లికార్జునరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ నరసింహారావు, నాయకులు షేక్ ఉస్మాన్, కె. నళినికాంత్, షేక్ ఖాజావలి, కోట మాల్యాద్రి పాల్గొన్నారు.

గోమయ వినాయక విగ్రహాల పంపిణీ

గుంటూరు రూరల్: మట్టి, గోమయంతో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాలుష్యం బారినుంచి కాపాడుకుందామని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో శనివారం గోమయం, మట్టి, గోరుచిక్కుడు పిండితో తయారు చేసిన 500 వినాయక విగ్రహాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో, గ్రామస్తులకు పంపిణీ చేశారు. ప్లాస్టరాఫ్‌పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణ కాలుష్యం జరుగుతుందని, కావున ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని ఆయన కోరారు.

72 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బస్తాల నిల్వను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు, డెప్యూటీ తహసీల్దార్ శివశంకర్

నగరంపాలెం: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వలు చేసి, కోళ్ల ఫారాల నిర్వాహకులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునే వ్యక్తిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. విజిలెన్స్ గుంటూరు రీజినల్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి ఏటీఅగ్రహారం 0/3 అడ్డ రోడ్డులో అద్దెకు ఉంటున్న పసుపులేటి రామకృష్ణ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో అక్రమంగా 152 బస్తాల్లో నిల్వ ఉంచిన 72 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. 41 బస్తాలపై సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ముద్రలున్నాయి. 150 ఖాళీ గోతాలు కూడా దొరికాయి. పట్టుబడిన రామకృష్ణపై నిత్యావసర సరుకుల చట్టం కింద 6 (ఎ) కేసుతోపాటు, క్రిమినల్ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, పౌరసరఫరాల శాఖ డెప్యూటీ తహసీల్దార్ శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్ల పరిశీలన

గుంటూరు రూరల్: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా అధికారులు పర్యవేక్షణ చేయాలని ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని ఓబులు నాయుడుపాలెం, పొత్తూరు గ్రామాల్లోని లేఅవుట్లను పరిశీలించారు. స్థానిక అధికారులతో అక్కడ జరుగుతున్న పనులు, వసతులను గురించి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ , త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

నేడు మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ



అక్మే కిడ్స్ స్కూల్లో వినాయకుని ప్రతిమలతో చిన్నారులు



విజ్ఞాన్ హైస్కూల్లో వినాయకచవితి ప్రతిమలతో చిన్నారులు



మట్టి వినాయకుని ప్రతిమలతో కెనడీ స్కూల్ విద్యార్థులు, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య

గుంటూరు ఎడ్యుకేషన్: వినాయకచవితిని పురస్కరించుకుని ఆదివారం లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాల ఆధ్వర్యంలో మట్టి వినాయకుని ప్రతిమల్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్ శనివారం తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

అక్మే కిడ్స్ స్కూల్లో వినాయకుని ప్రతిమల తయారీ

లక్ష్మీపురం మూడో లైనులోని అక్మే కిడ్స్ స్కూల్లో శనివారం వివిధ రకాల వినాయకుని ప్రతిమల్ని తయారు చేశారు. చిన్నారులకు వినాయకచవితి విశిష్టతను తెలియజెప్పేందుకు మట్టితో పాటు చాక్‌లెట్, కూరగాయలు, పండ్లు, గడ్డి, పిండి, దూదితో ప్రతిమల్ని తయారు చేసినట్లు పాఠశాల డైరెక్టర్లు దీప్తి, సౌగంధ్ కృష్ణ తెలిపారు.

విజ్ఞాన్ స్కూల్లో ..

గుంటూరు ఎడ్యుకేషన్: వినాయకచవితిని పురస్కరించుకుని ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థులు పర్యావరణ సహితంగా వివిధ పదార్థాలతో వినాయకుని ప్రతిమల్ని తయారు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి గణపతి ఆవశ్యకత చాటుతూ విద్యార్థుల ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట మూడో లైనులోని కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ మెరిట్ క్యాంపస్ విద్యార్థులు శనివారం మట్టి గణపతి ఆవశ్యకతను చాటుతూ ర్యాలీ నిర్వహించారు. మట్టి వినాయకుని ప్రతిమలను తయారు చేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకురాలు సావిత్రి, డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె. శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జస్టిస్ సోమయాజులుకు ఘన స్వాగతం



జస్టిస్ సోమయాజులుకు స్వాగతం పలుకుతున్న పార్థసారథి, ప్రభాకరరెడ్డి

గుంటూరు లీగల్: జిల్లాలోని న్యాయమూర్తుల వర్క్‌షాపునకు హాజరయ్యేందుకు శనివారం గుంటూరు నగరానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి ప్రభాకరరెడ్డి జిల్లా కోర్టు వద్ద పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వర్క్‌షాపు జరిగింది. ఇందులో జిల్లాలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు.

నేడు న్యాయాధికారులతో కాన్ఫరెన్స్

జిల్లాలోని న్యాయాధికారులతో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది.

స్పష్టత లేని పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల అజెండా



సమావేశంలో మాట్లాడుతున్న విద్యావేత్త సింగరయ్య

లక్ష్మీపురం: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో చర్చించే అంశాలపై ఇప్పటికీ పూర్తి స్పష్టత రాలేదని, తొలి రోజు అజెండాను మాత్రం ముక్తసరిగా ప్రకటించి ఊరుకున్నారని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య తెలిపారు.అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం చర్చా గోష్టి నిర్వహించారు.ఈ సందర్భంగా సింగరయ్య మాట్లాడుతూ కొత్త పార్లమెంటు భవనంలో ప్రారంభం కానున్న ఈ సమావేశాలకు విశిష్టత ఉందని అందరూ భావిస్తున్నారన్నారు. ప్రధానంగా పాత సంప్రదాయాలకు, విధానాలకు స్వస్తి చెప్పి కొత్త విధానాలకు స్వాగతం పలకాలని భావిస్తున్న కేంద్రం సమావేశాల అజెండాను ప్రకటించక పోవడం సరికాదని తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రవిబాబు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎన్నిక, ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకునే విషయమై కూడా చర్చ జరగవచ్చని తెలిపారు. అయితే, ప్రభుత్వం చేసే ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించేందుకు వ్యవధి ఉంటుందా? అనే సందేహం అందరిలో ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పురస్కారాల ప్రారంభంపై హర్షం

భారత శాస్త్ర పరిశోధనల రంగంలో నోబుల్‌గా భావించే శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారాల్ని ఏడాది జాప్యం తర్వాత కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంపై అవగాహన సంస్థ హర్షం వ్యక్తం చేస్తోందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత పరిశోధన శాలల పితామహునిగా భట్నాగర్ ఖ్యాతి పొందారన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



ర్యాలీలో విద్యార్థినులతో ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ఓజోన్ పొరను పరిరక్షించుకునేందుకు కాలుష్యాన్ని నివారించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమ కన్వీనర్లు ఎం. సంతోష్ కుమారి, డాక్టర్ ధాత్రీకుమారి, కె. సుబ్బరత్నమ్మ, డాక్టర్ కె. విజయకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.